పార్కులు, శ్మశానవాటికలకు మహర్దశ

- పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే పది పార్కుల గుర్తింపు
- కైలాసభూముల్లో కొనసాగుతున్న పనులు

గాజువాక: గాజువాక జోన్‌లో పార్కులు, శ్మశానవాటికలకు మంచిరోజులొచ్చాయి. వాటి పరిశుభ్రతపై అధికారులు దృష్టి సారించారు. పార్కులు, శ్మశానవాటిక ల్లో తుప్పలు, పిచ్చి మొక్కలు, డెబ్రిస్‌ను తొలగించాలని నిర్ణయించిన అధికారులు దీనికోసం గ్యాంగ్ వర్క్‌లను కూడా చేపట్టారు. ప్రాధాన్యతా క్రమంలో తొ లుత 10 పార్కుల్లో పరిశుభ్రత పనులను చేపట్టాలని నిర్ణయించిన అధికారులు గ్యాంగ్ వర్క్‌లను ముమ్మరంగా సాగిస్తున్నారు. ప్రజారోగ్య విభాగం సిబ్బందితో పార్కుల్లో ప్రత్యేక శానిటేషన్ నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే 73, 74 వా ర్డులలో మూడు పార్కుల్లో పరిశుభ్రత పనులను పూర్తి చేశారు. ఈ వార్డుల్లో మరో రెండు పార్కుల్లోనూ పను లు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. 76వ వా ర్డులోని అమరావతి పార్కు, 86వ వార్డు రావుల చెరువులో పిచ్చిమొక్కలను తొలగించారు. పార్కుల్లో చెత్తలను, ముళ్ల తుప్పలను తొలగించడంతో పాటు డెబ్రిస్‌ను పూర్తిగా తొలగించి అందంగా తీర్చిదిద్దుతున్నారు.


పార్కులో డెబ్రిస్ తొలగిస్తున్న సిబ్బంది

శ్మశాన వాటికల్లో ప్రత్యేక డ్రైవ్

జోన్‌లోని ఎంపిక చేసిన వివిధ శ్మశాన వాటికల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నివాసుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు సంబంధిత శ్మశానవాటికలో ఈ పనులను నిర్వహిస్తున్నారు. అగనంపూడి శ్మశాన వాటికలో కొద్దిరోజుల క్రితమే ఈ పనులను పూర్తి చేసిన అధికారులు పెదగంట్యాడలోని విమల విద్యాలయం వద్ద గల శ్మశానంలోని కొంత భాగంలో చెత్తలు, పిచ్చిమొక్కలను తొలగించారు. మిగిలిన భాగంలోనూ పనులు చేపట్టేందుకు సిబ్బందికి ఆదేశాలిచ్చామని సహాయ ప్రజారోగ్యాధికారి తెలిపారు. అనంతరం 76వ వార్డు డంపింగ్ యార్డులో పనులు చేపట్టాలని నిర్ణయించారు.


అమరావతి పార్కులో పిచ్చిమొక్కల తొలగింపు అనంతరం ఇలా..

ప్రాధాన్య క్రమంలో పనులు

ప్రాధాన్యత క్రమంలో అన్ని పార్కుల్లో, శ్మశానవాటికల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులను చేపడతాం. సాయంత్రం పూట ప్రజలందరూ పార్కులకు వెళ్లి సేద దీరే విధంగా అందుబాటులోకి తేవాలన్నదే మా ధ్యేయం. ముందుగా పది పార్కులను ఎంపిక చేసి పనులు ప్రారంభించాం. శ్మశానాల్లోనూ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మూడు శ్మశానవాటికల్లో శానిటేషన్ పూర్తి చేశాం.

–డాక్టర్ కిరణ్ కుమార్, గాజువాక జోన్ ఏఎంహెచ్‌వో

'కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న బీజేపీ'

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఇటువంటి ప్రభుత్వాల ఉనికి ప్రశ్నార్థకం కాక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 845వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి పేద, బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు.


845వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదల జీవితాలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి వినతి

గాజువాక: పెదగంట్యాడలో 24 గ్రామాలకు సంబంధించిన శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన పెదగంట్యాడ నిర్వాసితుల కోసం ఈ శ్మశానాన్ని కేటాయించారని, ప్రస్తుతం అది పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయిందని పేర్కొన్నారు. శ్మశానాన్ని శుభ్రం చేయించాలని కోరారు. నడుపూరు హైస్కూల్ వెనుకభాగంలో గల గ్రౌండ్‌లో మౌలిక సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు పిట్టా రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, ములకలపల్లి వెంకటేష్, తోకాడ అప్పారావు, కాకినాడ పెంటారావు, పాల అప్పలరెడ్డి తదితరులున్నారు.


జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

పక్షవాత బాధితునికి సాయం


రోగి కుటుంబానికి బియ్యం, సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: పక్షవాతంతో బాధ పడుతూ, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న దల్లివానిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. రోగి కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులతో పాటు వెయ్యి రూపాయల నగదును అందించింది. పిళ్లా నారాయణమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు పిళ్లా సత్యనారాయణ సహకారంతో వీటిని అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు పొన్నగంటి కొండలరావు, లక్కరాజు రాము, శీరంశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని లంకెలపాలెం కూడలిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బుధవారం శ్రీకారం చుట్టనున్నారు. రూ.43 లక్షల వ్యయంతో లంకెలపాలెం కూడలిలో విస్తరణ, అధునాతన విద్యుద్దీపాలు, రహదారుల, డ్రైనేజీల నిర్మాణ పనులకు ఆ రోజు ఉదయం 9గంటలకు అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 88వ వార్డు వెదుళ్లనరవ, నంగినారపాడు, నరవల్లో రూ.3కోట్ల వ్యయంతో శ్మశాన వాటికల అభివృద్ధికి భూమి పూజ చేయనున్నట్టు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తెలిపారు.

ఆగస్టులో జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

గాజువాక: వచ్చే ఆగస్టు నెలలో జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలను నిర్వహించనున్నట్టు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. పోటీల నిర్వహణకు సంబంధించిన న్యూ పెంటమాంబ జిమ్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో నిర్వహించనున్న ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 500 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, పతకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిమ్ ప్రతినిధి రామోజీ, కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మోరు తల్లి జాతర

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామ దేవత పెద్దమ్మోరు తల్లి జాతర మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి నిర్వహించే జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. టీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత తిప్పల రమణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొవిరి అవతారం, శేషు, రాజబాబు, తాతారావు, ఆనంద్‌కుమార్, పోలరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దశ మహావిద్యలపై ప్రవచనం

సీతంపేట : లలితాపీఠంలో జరుగుతున్న దశ మహావిద్యల ప్రవచనాలలో భాగంగా మూడో రోజు 'దశ మహావిద్యల ఆవిర్భావం'కు సంబంధించి పురాణ విశేషాలపై లలితాపీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. దశ మహావిద్య లలో చిన్నమస్త అనే శక్తి దేవత స్వరూప స్వభావాలను ప్రవచించారు. అలాగే రేణుకా దేవి కథలోని అంతరార్థం విశ్లేషించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని, పెద్ద సంఖ్యలో భక్తులు, పండితులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజా ప్రతినిధుల దృష్టికి కార్మికుల సమస్యలు

మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు

గాజువాక/అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీలో పారిశుధ్య కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ప్రజాప్రతినిధులను కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు పి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు మంగళవారం వినతి పత్రాలను అందజేశారు. జీవీఎంసీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తూ మృతి చెందిన వారు, రిటైర్మెంట్ తీసుకున్నవారు, లాంగ్ ఆబ్సెంట్ వల్ల ఖాళీ అయిన 482 పారిశుధ్య కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని, క్లాప్ ఆటో వర్కర్స్‌కి కనీస వేతనం రూ.18500 చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు ఉరుకూటి రాజు, గొలగాని అప్పారావు, ఎం.వి.ప్రసాద్, శీర రమణ, శంకర్‌రెడ్డి, గొల్ల రాము, అప్పన్న, నక్క నాగరాజు, మహేశ్వరి తదితరులున్నారు.


మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక స్పందన నేడు

పెదగంట్యాడ: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక స్పందన నిర్వహించనున్నామని తహసీల్దార్ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వెళ్లిరావడం స్థానికులకు దూరాభారం కావడంతో ఇక్కడ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని సూచించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ అంశంలో విపక్షాల రాజకీయం'

ఉక్కునగరం: ఉక్కు కర్మాగారాన్ని అభివృద్ధి చేయడం బీజేపీ వల్లే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అంశంలో విపక్షాలు రాజకీయం చేస్తున్నాయన్నారు. ఉక్కునగరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 41 నుంచి 47 వరకు బూత్ కమిటీలను నియమించి సరళ్ యాప్ నమోదు చేశారు. పలువురు ఓటర్లను కలిసి ఓటు నమోదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, మండల అధ్యక్షుడు పి. నాగేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు విశాల్, ప్రధాన కార్యదర్శి జగ్గారావు, మహంతి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి తిరుపతిరావు

ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలి

మహారాణిపేట : రాబోయే వర్షా కాలంలో వరద నిర్వహణకు లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలని విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీవో) డి.హుస్సేన్‌సాహెబ్ అధికారులను ఆదేశించారు . మంగళవారం సాయంత్రం తన ఛాంబర్లో 2023 నైరుతి–పశ్చిమ రుతు పవనాలతో వర్షాలు కురిసినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎలక్ట్రికల్, మెడికల్, మున్సిపల్, వ్యవసాయం, పశుసంవర్ధక, అగ్నిమాపక, టెలికమ్యూనికేషన్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. తుపాను షెల్టర్ల పరిస్థితిని పరిశీలించి మరమ్మతులు అవసరమైతే చేయించాలని ఆదేశించారు. జిల్లాలో సంబంధిత ప్రదేశాల్లో తగినంత మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్నిమాపక, రోడ్లు – భవనాలు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో మనోరంజని, మెడికల్, జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మలేరియా, డెంగ్యూ నివారణకు కృషి


ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలిస్తున్న మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ, కాళికానగర్ ప్రాంతాల్లో మలేరియా సిబ్బంది డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు కె.అప్పలరాజు, ఆర్.విష్ణుకుమార్ పలు నివాసాలకు వెళ్లి ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించి దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ చక్రవర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం విశేషంగా ఆర్జిత సేవలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంప జేసి అష్టోత్తరశతనామావళిపూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఘనంగా విజయ కనకదుర్గాదేవి పండగ

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీ కొండపై కొలువుదీరిన విజయ కనక దుర్గాదేవి పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, జోనల్ కమిషనర్ సింహాచలం, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, ఉరుకూటి చందు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గొల్లపల్లి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మద్దాల అప్పారావు, లోకనాథరావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, దేముడు, జుత్తు లక్ష్మి, పుష్ప, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

స్వర్ణ పతక విజేతకు సత్కారం


లక్ష్మిని సత్కరిస్తున్న సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ తదితరులు

గాజువాక: జాతీయస్థాయి యోగా పోటీల్లో స్వర్ణపతకం సాధించిన న్యాయవాది, ఏపీ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మిని ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ చైర్ పర్సన్ బి.సత్యనారాయణ సత్కరించారు. న్యాయవాదిగా ఉన్న లక్ష్మి జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తుండటం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఇండిపెండెంట్ సభ్యుడు సురేంద్ర కుమార్, యాత, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, స్థానిక నాయకులు తోకాడ అప్పారావు, ఓడిబోయిన శంకరరావు, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల పండగ సందడి


మూడుగుళ్ల వద్ద మహిళల కోలాటం


ప్రతిమలను ఊరేగిస్తున్న మహిళలు

సీతంపేట: సీతంపేట, అక్కయ్యపాలెం గ్రామ దేవతల పండుగలతో ఆయా ప్రాంతాల్లో పండగ సందడి నెలకొంది. అక్కయ్యపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గౌరీ సేవా సంఘం ఏర్పాట్లు చేసింది. ఉత్సవంలో భాగంగా తొలివారం భూలోకమాత ఉత్సవం జరిగింది. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి పసుపు,కుంకుమ, మొక్కుబడులు సమర్పించారు. అమ్మవారి ఘటాలను రామాలయం నుంచి మూడుగుళ్ల వరకు మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, కోలాటం, గరిడీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు పాల మరశెట్టి ఎస్‌జేవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 13న కుంచుమాంబ ఉత్సవం, 19న పుట్టబంగారమ్మ వేడుకలు, తొలేళ్ల సంబరం జరుగుతుందన్నారు. 20న ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండుగ జరుగుతుందని తెలిపారు. సంఘం అధ్యక్షులు కొయిలాడ వేణుగోపాల్, చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


పూజలందుకుంటున్న అమ్మవారు

సీతంపేటలో... : సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవంలో భాగంగా తొలివారం భూలోకమాత పండుగ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ నెల 11న అమ్మవారి పండుగ చాటింపు, 12న తొలేళ్ల పండుగ, 13న కనకమాంబ అమ్మవారి ప్రధాన పండుగ జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ తెలిపారు.

పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్ కేసులు

అక్కిరెడ్డిపాలెం: భారత్‌లో బ్రెయిన్ ట్యూమర్ల సంఖ్య క్రమేపీ పెరుగుతోందని, ఏటా 24 వేల మందికి పైగా ఈ వ్యాధితో మరణిస్తున్నారని కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ కె.అచ్చయ్య నాయుడు అన్నారు. మెదడు కణితులు ముందుగా గుర్తించి చికిత్స చేయించకపోతే ప్రాణాంతకం కావచ్చన్నారు. జూన్ 8న బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొబైల్ ఫోన్లు, సెల్ టవర్ల నుంచి, ఊబకాయం, కుటుంబ చరిత్ర, క్యాన్సర్ ఉన్న పెద్దవారికి కూడా మెదడు కణితులు వచ్చే అవకాశం ఉందన్నారు. కణితుల వల్ల తలనొప్పి, మూర్ఛ, చూపు మందగించడం, వాంతులు, గందరగోళం, అవయవాల్లో బలహీనతలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం, మానసిక స్థితి, కనురెప్పలు పడిపోవడం, మైకం, శరీరం ఒకవైపు పడిపోవడం, పేగు, మూత్రాశయంపై నియంత్రణ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. సరైన సమయంలో బ్రెయిన్ ట్యూమర్‌ను గుర్తించి వైద్యం చేయించుకోవడం వల్ల ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. అక్కయ్యపాలెంలోని గొల్లలపాలెంకు చెందిన నడిపిల్లి తేజ ఓ పాలిటెక్నిక్ కాలేజ్‌లో చదువుతూ స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధుల్లో భాగంగా నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ దరి ఓ హోటల్ నుంచి ఐటీఐ జంక్షన్ సమీపంలో ఫుడ్‌ను డెలివరీ చేసేందుకు ఊర్వశీ బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో తేజకు తీవ్రగాయాలయ్యాయి. అతను ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. తేజ తండ్రి నడిపిల్లి అప్పల నాయుడు ఫిర్యాదు మేరకు ఐదో పట్టణ సీఐ ఎస్ విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఢీకొట్టిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

అగనంపూడి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల బండిలా దూసుకుపోతోందని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ అన్నారు. అగనంపూడిలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నవరత్నాలతో అట్టడుగు వర్గాల సంక్షేమానికి పాటు పడడంతో పాటు విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో వినూత్నమైన కార్యక్రమాలతో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా మారనుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మా నమ్మకం, ధీమా అని ప్రజలు బహిరంగంగా చెప్పే పరిస్థితిని తీసుకువచ్చారన్నారు. అందరి మన్ననలతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పూర్ణ

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

8న సహస్ర తులసిపూజ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

పెదగంట్యాడ: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో చిన్నారులతో ఆటలు ఆడించారు. పుస్తకాలు చదివించారు. కథలు చెప్పారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.


క్యారంబోర్డు ఆడుతున్న చిన్నారులు